వారం వారం కథా ప్రభ


# అంతర్నాటకాలు

నల్లూరి వెంకటేశ్వరరావు

## ఒకటవ రంగం

**ఆమె రెండు చేతుల్లో బట్టల సంచులున్నాయి. వెనకనే ఇద్దరు తొమ్మిది-పది సంవత్సరాల పిల్లలు. ఆమె ముఖంలో తెలివితేటలు అట్టే కనబడటం లేదు. రంగస్థలానికి రెండుమూడు అడుగుల దూరం దాకా నడిచివచ్చి, సంచీలు కింద వుంచి, అక్కడ ఉన్న కుర్చీలో కూర్చోవాలా వద్దా అన్న సందిగ్ధంలో ఒక కుర్చీమీద చేయి వేసింది. చింతామణి తాలూకు మనిషా? రిహార్సలు చూడటానికి మాత్రం తెచ్చి ఉండడు. "ఉస్" మని బుసకొడుతూ, నడుము విరిగిన వాడిలా ఒక కుర్చీలో వెనక్కు వాలిపోయాడు. 'ఆ కుర్చీలో చేరబడమ్మా,' అన్నాడు. అందరూ చింతామణి వైపు చూస్తున్నారు - ఆ మిస్టరీని ఛేదించగలవాడు అతనే కాబట్టి.**

"ఈమెతో నాకు ఇంతకు ముందు పరిచయం లేదు. కర్నూలు నుంచి వస్తున్నారట, విజయవాడలో బస్సు మారి. శెలవలు గడిపేందుకు విశాఖపట్నం వచ్చారు. బంధువు ఒకాయన ఉన్నాడు ఇక్కడ. చింతకాయల రామదాసుగారు. డాబా గార్డెన్సులో ఆయన ఇల్లు. ఆమె హ్యాండ్ బాగ్ తునిలో ఎవరో స్త్రీ కొట్టేసిందట. అతని చిరునామా ఆమె పోగొట్టుకున్న బ్యాగులో ఉండి



పోయింది. ఈ ఊరు రావటం ఆమెకు ఇదే ప్రథమం. చింతకాయల వారు మన సంస్థలోనే పనిచేస్తున్న విషయం ఆమెకు గుర్తుందట. ఏ డిపార్టుమెంటో మాత్రం తెలీదు. మనకు తెలిసిన వాళ్లందరిని వాకబు చేశా. పదివేల మందిలో రామదాసుగారిని పట్టుకోవటం ప్రస్తుత సమస్య - కాదు, మానవతా బాధ్యత."

చింతామణి చెప్పటం అవగానే ఆపేరు గల వ్యక్తిని గుర్తుకుతెచ్చుకొనే ప్రయత్నం జరిగింది. తర్జన భర్జనలయ్యాయి.

"ఏమమ్మా, రామదాసుగారు అసలు మా సంస్థలోనే పనిచేస్తారనే నీకు రూఢీగా తెలుసా?" పోలీసు అధికారిలా అడిగాడు స్వామి.

'నౌకలకు సంబంధించిన సంస్థేకదండి ఇది?'

"నౌకా నిర్మాణ కేంద్రం వుంది. నౌకా శ్రయం వుంది. నౌకాదళం వుంది. అన్నీ నౌకలకు సంబంధించినవే."

"ఈ సంస్థే అని నాకు జ్ఞాపకం."

"ఈ గడ్డివామిలో ఆ సూదిని ఎలా వెతకటం? ఈ జనసముద్రంలో దాగిన ఆ జీవిజాడ ఎలా తెలియనగును?" నాటకీయంగా అన్నాడు చింతామణి, స్వామితో.

"చింతకాయల పోలిపిల్లి మెరీన్ఫోర్మన్ విభాగంలో పనిచేస్తున్నాడు. అతనికి తెలుసేమో?" స్వామి అన్నాడు.

చింతామణి, ఆ ముగ్గురూ నిష్క్రమించారు.

## రెండవరంగం

"నన్ను నమ్మండి నాకే పాపం తెలీదు మోసం తెలీదు..."

"అమ్మా! విరామచిహ్నాల పాఠం నేర్చుకుని వుండవలసింది నటనకు పూనుకునే ముందు. నన్ను నమ్మండి తర్వాత ఫుల్‌స్టాప్. పాజ్ తర్వాత, మాడ్యులేటెడ్‌గా పాపం -మోసం తెలీదన్న మాటలు అనాలి. అవి బొడ్డు దగ్గరనించి రావాలి." ఆమె అర్ధరూపాయిబిళ్లంత బొడ్డును వేలుతో చూపిస్తూ-ఆమె బొడ్డుఏదో ఆమెకు తెలీనట్లు-అన్నాడు స్వామి.

"నన్ను నమ్మండి...." అని పెద్దగా నవ్వింది, తన బొడ్డు ఏదో తనకు చూపుతున్నందుకు.

"కన్నీటితో తడుపుతూ అనాల్సిన మాటలు, నవ్వులు పూయిస్తూ అంటే నమ్ముతాడా? తేలిగ్గా మోసపొయ్యే మొగుళ్లుంటారు నాలాగా, మీ ఆయన లాగా. ఓ.కే. వాడు ఒక వేళ అనుమానించి నిలె య్యడం జరిగితే, 'నన్ను నమ్మండి, హి హి హి' అంటే, అపుడు నమ్ముతాడా? చాచి లెంపకాయ ఇస్తాడు."

"ఒక పక్క ఉక్క, మరోవైపు ఆకలి... మీరు చెప్పినట్లు సంభాషణలు చెప్పాలంటే మామూలు తిండి సరిపోదు." పవిట తీసి విసురుకుంటూ అన్నది.

నిధి ఆబ ఆబగా చాశాడు.

"మామూలు తిండి చాలక పై తిండి మరిగితే, సందు దొరికినపుడల్లా మామూలు తిండి సంగతి వదిలి పై దానికి పరిగెత్తటం సహజం," అని జేబులు తడుముకున్నాడు స్వామి.

"మీ ఆయనకు నైట్‌డ్యూటీ ఈ వారంలో ఏ రోజు పడింది?" నిధి అడిగాడు నెమ్మదిగా.

'ఏం? రాత్రయితేగాని నీకు మూడ్ రాదా?' అంటూ జేబులోని చిల్లర టేబుల్‌మీద పోశాడు పాముచెవుల స్వామి.

"మీ ఆయన చాలా మంచాయన" అన్నాడు నిధి, ఇంకా ఏమిటి చెంగుతో విసురుకుంటున్న భగవతితో.

"చెడ్డాయన అయ్యుంటే భార్య అయిన భగవతిని, స్నేహితుడైన నిన్ను అంతలా నమ్మి ఉండేవాడా?"అని పైకి అని 'బెడ్డు కూడా వాడిదే కావాలా?' అని నిధిని తిట్టుకున్నాడు స్వామి.

ఒక అట్టముక్కని ఆమె వళ్లోకి విసిరాడుస్వామి. "ఆ పైటను ఎక్కడుండాలో అక్కడ ఉంచి, ఆ అట్టతో విసురుకో, నిధిగారికి నోటంట డైలాగులు రావు. చొంగతప్ప - అది స్థానభ్రంశం అయినంత సేపు."

"ఇంతకూ, తినటానికి ఏమైనా తెప్పిస్తున్నారా, లేదా?" చూపులు మరలించుకుని కొంచెం కోపంగా అన్నాడు నిధి.


స్వామి ఏమీ తెప్పించకపోవటం కాదు ఆ కోపానికి కారణం-ఆమె వడిలోకి అట్ట విసరటం, మరొకరి స్వంత భార్యమీద నిధి ఆడ ఈగను వాలనీయడు.

"మీరు తినడం, తాగటం - అదే, కళ్లతో అవుతోంది గదా, వేరే తిండి ఎందుకు? ఆమె విషయం నే చూసుకుంటాలే. అది సరే, ఈ కాగితం మీద సంతకాలు పెట్టండి," డబ్బులు లెక్కపెట్టుకుంటూ కాగితం ఇచ్చాడు.

" 'ఆమెను నేను చూసుకుంటాను' అంటా డేమిటి? సలుపుతున్న పుండును కెలికినట్లు. అయితే 'అవతలివాడు ఫల్గుణుడు'. స్వామిగాడు రాష్ట్ర స్థాయి నాటకరంగంలో పేరున్న ప్రయోక్త. ఆవేశానికి పోతే ఏ నాటకంలోకి తీసుకోడు. సహనం తెచ్చుకున్నాడు నిధి. "డిస్క్రిషన్ ఈజ్ బెటర్ పార్ట్ ఆఫ్ వేలర్. అయితే శాబ్రె రాట్లింగ్ అన్నా చేయకపోతే అహంగాడు ఊరుకోడు."

"అయిదొందలు మాకు ముట్టినట్టు రాశారు. మా కిచ్చింది మూడొందలేగా?"

"నిధిగారికి ఉన్నట్లుండి జ్ఞానోదయా లవు తుంటాయి."



"సంతకాలు ఎన్ని కావలిస్తే అన్ని. ఎక్కడ కావలిస్తే అక్కడ పెడతాం గాని, నా సంగతి చూడండి."

నిధి కోపం ఈ సారి ఆమె మీదికి మళ్లింది. 'మొగుణ్ని మోసం చేసేది ప్రియుడ్ని చెయ్యదా? ఆమె మోసగొట్టు గుణానికి నియమం, పరిధి ఉంటాయా? 'సంగతి చూడటమేమిటి, సంగతి?' పళ్లు నూరేడు.

'నిన్న రాత్రి పదకొండు గంటలకు చిల క్కొయ్యకు చొక్కా తగిలించినప్పటికి నా జేబులో యాభైరూపాయల చిల్లర వుండాలి. అప్పటినుంచి ఇప్పుడు మొదటిసారిగా జేబులోకి చేయివెళ్లి, డబ్బు తీసి లెక్కపెడుదును గదా ముప్ఫైరూపాయలు గల్లంతు-నా పుత్రరత్నమో, భార్యాశిరోమణో ఈ సారి పుణ్యాం కట్టుకుంది. మిగిలిన ఇరవైలో పది హేను రూపాయలకు ఏమొస్తే అది తెప్పించుకోండి.'

"నాటకానికి అయిన ఖర్చు ఎక్కువగా చూపి, ఆపీసు డబ్బు మీరు గుంజుతారు. ఇంటి దొంగలు మీకు టోకరా వేస్తుంటారు. ఏం తప్పులేదు," న్యాయం ప్రవచించింది జస్టిస్ భగవతి.

గణపతి, రత్నం హాలు ప్రవేశ ద్వారంలో ఒకదాని దగ్గర మాట్లాడుకుంటున్నారు. ఉద్యోగాల తో పాటు ఉభయులూ కలిసి వ్యాపారం చేస్తున్నారు. పెత్తనం గణపతిది. రూపాయిలో తొంభై ఎనిమిది పైసలు తిని, రెండు పైసలు లాభంగా చూసి, "తనవంతు" పైసా తను తీసుకుని వందవ పైసా

రత్నానికి ఇస్తాడు. నిన్ను వాడు మోసంచేస్తున్నాడని ఎవరు చెప్పినా నమ్మ నిరాకరిస్తూ స్వీయ వంచనకు పాల్పడుతున్నాడు రత్నం.

వీళ్లు నీతిమంతుల్లా తన గురించి మాట్లాడు కుంటున్నారు? అన్న అనుమానంతో పది నిమి షాలు పీడింపబడిన తర్వాత, ఏవో రాజకీయాల్లా ఉన్నాయి, ఈ మాటలు గాలి మోసుకొచ్చింది : బైన్ డైరీ... సెయింట్ కిట్స్... ఫోడ్డర్ స్కాము.... సూట్‌కేస్... తన గురించి కాదు. తన దొంగ బిల్లుల గురించి కాదు. స్వాహా అన్నమాట వినిపించిందే గాని స్వామి అన్నమాట వినిపించలేదు. నిధి, భగవతి ఏం మాట్లాడుకుంటున్నారో వినబడటం లేదు. రాత్రి కార్యక్రమం గురించేమో. కార్యక్రమమంటే గుర్తుకొచ్చింది. అయిదు రూపాయలకు ఏ బంకు వాడు పెట్రోలు పోస్తాడు? కుర్రాడు తీశాడా, భార్య తీసిందా? కుర్రాడిని అడిగితే అమ్మ తీసి ఉంటుందంటాడు. ఆమె నడిగితే కొడుకు మీద నేరం మోపుతుంది.

"దేశం, మోసం వదిలేసి మీ మీ పోర్షన్లు చదువుకోగూడదండి? వేదిక ఎక్కిన దగ్గర్నుంచి నత్తి వచ్చినట్టు టెక్కుతారు. శంకరం రాడా? ఆఫీసు హాజరు పట్టీలో స్పేర్డ్ టు రిహార్సల్స్ అని రాయించుకుంటారు, స్వంత పనుల మీద తిరుగు తుంటారు. ఇదేం మోసం?"

"నటన అన్నా మోసమే గదా స్వామీజీ," అని నాటక కొరుక్కున్నాడు రత్నం.

అందరూ రిహార్సల్స్‌కి ఉపక్రమించారు. చక్కని నటనను రంగస్థలం మీద ప్రదర్శించటానికి, ప్రేక్షకులను రంజింప చెయ్యటానికి అది వాళ్లకు నటన అని తెలుసు; ఒక అబద్ధమని తెలుసు. ఆ నిజంకాని దాన్ని నిజం అని నమ్ముతూ రంజిలు తారు. నిజాన్ని ఎంత అబద్ధంగా చూపగలిగితే, అబద్ధాన్ని ఎంత నిజంగా చూపగలిగితే ఆ నాటక ప్రదర్శనలో అంత కృతకృత్యులైనట్లు!

## మూడవ రంగం

థియేటర్ ఆఫీసుగదికెళ్లి అయిదు నిమిషాల్లో తిరిగివచ్చారు చింతామణి, వాళ్లు.

"మొత్తం మీద దొరికాడు" అన్నాడు.

"ఎక్కడ పనిచేస్తున్నాడు?" స్వామి

"దొరికింది పోలిపిల్లి, చింతకాయల ఇంటి పేరుతో గల పదిపేర్లు ఏకరువు పెట్టాడు. అందులో రామదాసు లేడు."

"మీరు, మీ పిల్లలు అంత దూరంనించి ఒంటరిగా ఎలా వచ్చారు? మీ ఆయన ఎందుకు రాలేదు?" భగవతి అడిగింది.

"ఆయన లెక్చరర్‌గా కర్నూలు ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్నారు. శెలవులు ఇచ్చారు. ఆదోనికి బదిలీ చేయించుకునే ప్రయత్నంలో మమ్మల్ని బస్సెక్కించి, ఫోనులో రామదాసుగారితో ఇక్కడ బస్టాండుకు వచ్చి రిసీవ్ చేసుకోమని చెప్పారు. అటునించి అటు హైదరాబాద్ వెళ్లి పోయారు. రామదాసుగారు ఎంచేతనో బస్టాండుకు రాలేదు. డబ్బంతా బ్యాగులో ఉండిపోయింది పిల్లల మనీపర్సు ఈ సంచీ అడుగున పడేశాను. అందులో ఉన్న పదిరూపాయలతో ఆటో చేయించు కుని నేరుగా ఇక్కడికి వచ్చాం. రిసెప్షనిస్టు మమ్మల్ని చింతామణి గారికి అప్పగించింది."

ఇదంతా అనుమానపు చూపులతో విన్నాడు రత్నం. అతని చూపులలోని భావాన్ని స్వామి గ్రహించినవాడై, రంగస్థలం మీద ఏ భావాన్నీ వ్యక్తీకరించలేదు గాని, నిజజీవితంలో మాత్రం మాటా పలుకూ లేకుండానే కళ్లతోను, పెదవి విరుపులతోను, ముఖ కవళికలతోను అవతలివాడికి బూతులు తిన్న అనుభవాన్ని ప్రసాదించగలడు అనుకున్నాడు.

'చింతామణీ! రాందాసుగురించిన ప్రయత్నం మరోవ్యక్తిద్వారా చెయ్యవచ్చు. ఫోనుదగ్గరకు పద,' అన్నాడు రత్నం, తను కదులుతూ.

ఆ మాటలు 'నీ అంతు చూస్తా పద' అన్నట్లు

> **నిజం బయటపడక మానదు**
>
> "నేను సంప్రదించిన మిగతా డాక్టర్లందరూ నా రోగం మీరు చెప్తున్నది కాదని అంటున్నారు డాక్టరుగారూ" అన్నాడు పేషెంటు.
>
> "అట్లాగే అంటారు లెండి. శవ పరీక్ష జరిగినపుడు నే చెప్పిందే నిజమని తేలక పోదు" అన్నాడు వైద్యుడు.
>
> ఛాయ

తోచాయి చింతామణికి. భయంభయంగా రత్నంతో నడిచాడు.

"నాటకంలో ఈ అంతర్నాటకా లేమిటి?" అని చికాకు పడ్డాడు స్వామి. రిహార్సల్స్ సరిగ్గా సాగడం లేదు.

దూరంగా వెళ్లి కుర్చీలో కూర్చుని రాతప్రతితో కుస్తీపడుతున్నాడు గణపతి-చేతులు తిప్పుతూ, మూతీ ముక్కు, కళ్లు అష్టవంకరలు పోనిస్తూ. బహుశ, ఈ హావభావాలు ఎవరూ తేలేనివి అని నవ్వుకున్నాడు. వీడికి ఈ జన్మకు రంగస్థల నటన అబ్బదు. వీడికి నటన నేర్పటంకన్నా, గాడిదకు భరతనాట్యం నేర్పటం తేలికేమో అని నిస్పృహకు లోనయినాడు స్వామి. నాటకం ఎట్లాపోతే నాకేం-చూసేవాళ్లు చస్తారు. వాళ్లు రాళ్లు రువ్వితే అవి నాకు తగలవు. నా నాలుగు రాళ్లు నాకు దక్కు తాయి. ఆఫీసు పని నుంచి నెలరోజులు వెసులు బాటు అని సమాధాన పడబోయ్యాడు. కానీ... కానీ.... అతనిలో పూర్తిగా మరణించని కళాకారుడి మూలుగు వినిపిస్తోంది. అది వినపడకుండా ఉండటానికే గాక, తనది కాకపోతే తెగబారెడు లాగమన్నట్లు - జాలి నటిస్తూ (నటన మొదటి గుక్క తల్లిపాలతో అలవడింది గదా)- "అమ్మా! ఇంతకూ ఏవన్నా ఇంత తిండి తిన్నారా మీ ముగ్గురూ?" అని అడిగాడు అప్పుడే వచ్చిన చింతామణిని, రత్నాన్ని చూస్తూ.

ఆకలి కళ్లు దించి మౌనంగా ఊరుకుంది.

"ఒరే, ఈ కట్టుకథని నిజమని నమ్ము తున్నావా?" అని మొదలుపెట్టి, తనకు వచ్చిన బూతులో ఏదీ వదలకుండా తిట్టాడు.

'మనుషుల మీద నాకు నమ్మకం ఎక్కువరా. అవతలి వ్యక్తిచెబుతున్న దాంట్లో కేవలం పదిశాతం నమ్మకం కుదిరినా నమ్మి మోసపోవటం ఉత్తమం,' నోరు పెగుల్చుకుని చింతామణి అన్నాడు. తిట్ట డానికి బూతులు మిగలక కళ్లతో నిప్పులు రువ్వి, చావమని శపించి వదిలేసిన తర్వాత, ఇద్దరూ కలిసి వాళ్ల మధ్య ఏమీ జరగనట్లు రంగస్థలం చేరేసరికి స్వామి ఆ జాలి మాటలు అన్నాడు.

'చింతామణీ! వాళ్లకు ఇంత తిండి పెట్టించు' పురమాయించాడు స్వామి-వాళ్లు చింతామణికి స్వయాన భార్యా పిల్లలన్నట్లు, వాళ్ల కడుపులు బాధ్యతారహితంగా అతను మాడుస్తున్నట్లు.

చింతామణి, ఆ ముగ్గురూ నిష్క్రమించారు.

నాటకం కొనసాగుతోంది.

"జుత్తు అలాకాదు నాయనా, ఇలా గట్టిగా పిడికిలి బిగించి పట్టుకోవాలి."

'మీ సొమ్మేం పోయింది? పోయేది నా జుత్తు.'

"అంతకన్నా విలువైంది పోగొట్టుకున్నావు గదమ్మా-బోడి వెంట్రుకల మీద ప్రేమా?"

"ఇదుగో, నాటకం లేదు గీటకం లేదు. నేపోతున్నా. వెదికి, ఎవరన్నా, సతీసావిత్రి దొరికితే నా పాత్ర నటింపచేసుకోండి." అని నాలుగడుగులు వేసింది.

"తల్లీ! నీకు పుణ్యం ఉంటుంది. నీ కాళ్లు పట్టుకుంటా-నీ అనుమతితోనేలే. నేను వసు దేవుడిని కాదులే. నీవు పోగొట్టుకున్న దాని గురించి, రాబట్టుకున్న దానిగురించి ఎత్తనులే... జుత్తు గట్టిగా పట్టుకున్నట్టు కనిపిస్తూ ఒదులుగా పట్టుకో. ఒక్క వెంట్రుక ఊడినా ముందు నేను ఊరుకోను. ఆ క్షణాన నీ భార్యను గుర్తుకు రానీకు... అపుడు ఈ పతివ్రత, బ్రతిమిలాడుతూ వచ్చిన గొంతు మార్చి, తిరగబడే ధోరణిలో, ఆ డైలాగుందే, అదే, 'నీవేం శ్రీరాముడివా? అల్లా దానితో పోలేదా, ఇల్లా దీనితో పోలేదా... ఆ చేంతాడు వదులు."

పావుగంటకు వాళ్లు నలుగురు తిరిగి రంగ ప్రవేశం చేశారు. నిష్క్రమిస్తామన్న ప్రాణాలు వాళ్ల ముగ్గురి కళ్లలో నిలిచి కనిపిస్తున్నాయి.

రత్నం చింతామణిని, స్వామిని పక్కకు పిలిచాడు. "ఆ భాగోతం నమ్మదగినది కాదంటే వీడు నమ్మటంలేదు. చెడామడా తిట్టి వాళ్లని పంపించేస్తానంటే, నీతో ఈ జన్మకు మాట్లాడ

నంటున్నాడు." స్వామికి ఫిర్యాదు చేశాడు.

"నమ్మటమా, మానటమా అన్న సందిగ్ధంలో నేనూ ఉన్నాను" అన్నాడు స్వామి.

చింతామణిని వేధిస్తున్న అంశం - మరో గంటకో, ఘడియకో కార్యాలయపు సిబ్బంది, థియేటరులోని నాటకపు మనుషులు వెళ్లిపోతే వీళ్లను ఈ రాత్రికి ఎక్కడికి తీసుకువెళ్లి పెట్టాలి?

రత్నం ఆఖరి పిల్లని ఇంటర్వ్యూ చేస్తున్నాడు. ఆ పిల్లలంటే ముచ్చటపడి కాదు. మాట్లాడిస్తే ఏదో ఒక దాగిన అంశం బయటపడొచ్చు. వీళ్లబండారం వెల్లడి కావచ్చు.

"నీ పేరు?"

"శకుంతల."

"ఏం చదువుతున్నావ్, ఎక్కడ చదువుతున్నావ్?"

"కర్నూలు విజయా పబ్లిక్ స్కూల్లో."

"ఏదైనా పద్యం చెప్పు."

"ఉప్పు కప్పురంబు...."

"మీ నాన్న పేరేంటి?" చెప్పింది.

"ఏ ఊరు వెళ్లారు?" చెప్పింది.

'ఈ ఊరు రైల్లో వచ్చావా, బస్సులో వచ్చావా?'

"కర్నూలునుంచి విజయవాడ దాకా ఒక బస్సు. ఆ ఊరునించి మరో బస్సు."

"విజయవాడ నుంచి రైల్లో రావటం సులభం, ఖర్చు తక్కువ, త్వరగా ప్రయాణం ముగుస్తుంది. బస్సులో తొమ్మిది, పది గంటల ప్రయాణం ఎందుకు చేశారు?"

అది ఆ పిల్లని అడగవలసిన ప్రశ్న కాదు. ఆమె అందుకుంది.

"ఒకే బస్టాండులో ఒక బస్సు దిగి మరొకటి ఎక్కడం తేలిక. ఆ ఊరు తెలీదు. బస్టాండు నుంచి ఏ రిక్షానో మాట్లాడుకుని స్టేషనుకెళ్లి, టికెట్టు తీసుకుని ప్లాట్‌ఫాం వెతుక్కోటం యాతన."

చింతామణి బాధ పడ్డాడు-అనుమానించి ఆ ప్రశ్నవేశారని ఆమె బాధపడుతుందని. రత్నంమీద కోపం వచ్చింది. 'నీ యక్షప్రశ్నలు ఆపరా బాబూ' అన్నాడు సాధ్యమయినంత మృదువుగా - లేకపోతే, చాటుకు తీసుకెళ్లకుండా వాడు ఇక్కడే వాయిస్తాడు.

"ఇలా రారా" అని రత్నం చింతామణిని భుజం పట్టుకుని పక్కకు తీసుకుని పోనేపోయాడు.

"నేను అనుమానిస్తున్నానని బాధపడుతున్నట్లున్నావు. నిజం తెలుసుకునే ప్రయత్నం చెయ్యటం నేరమా? ఎవరన్నా మనల్ని మోసం చెయ్యటానికి ప్రయత్నిస్తే, అది మన తెలివితేటల్ని సవాల్ చేస్తున్నట్లు భావించాలి. మనను అవమానిస్తున్నట్లుగా తీసుకోవాలి. మోసాలని సహిస్తూ పోవటం వలననే సమాజం ఇలా వుంది.

"పరిపాలకులు పరిపాలితులను అనుక్షణం చేసేదే అది. అది చేయించుకోటానికే వాళ్లని మన నెత్తిన ఎక్కించుకుంటున్నాం. వీలవ్వాలేగాని ప్రతి వ్యక్తి మరోవ్యక్తిమీద స్వారి చెయ్యటానికి చూస్తాడు. ప్రతి మోసాన్నీ ఛాలెంజ్‌గా, అపాం సమస్యగా భావిస్తూపోతే జీవితం నిరంతర రణక్షేత్రం అవుతుంది. ఒక రచయిత అన్నట్లు మన దేశానికి ఎవరిపేరు పెట్టుకున్నామో ఆయన పుట్టుకే ఒక మోసపు నేపథ్యంలో జరిగింది..."

తల్లీకూతుళ్లు వాళ్లవైపు నడిచి వస్తున్నారు. రంగస్థలం మీద భగవతి ఏడుస్తూ, భర్తను తన శీలాన్ని శంకించద్దు అంటోంది. మాటలు వినబడని ఆ ఏడుపు దృశ్యం నవ్వుపుట్టిస్తోంది.

ఆఖరి పిల్ల ఉన్నట్లుండి అంది - "వీళ్లు మనల్ని పట్టించుకోవటం లేదే!"

"ఏం పట్టించుకోమంటావ్?" కోపంగా అడిగాడు రత్నం.

"మా మామయ్య అడ్రసు కనుక్కోండి."

"తప్పమ్మా, అలా అనగూడదు. అడ్రసు బ్యాగుతో పోయింది గదా!చమనకే తెలీదు. వాళ్లు ఎలా కనుక్కోగలరు?"

"కనుక్కోవచ్చు. పేపర్లో వేయిద్దాం. 'చింత కాయల రామదాసు ఫలాన చిరునామాకు వచ్చి, ఎదురు చూస్తున్న ఫలాన జీడిపిక్కల వారిని కలుసుకోమని'," కోపంగా అని రంగస్థలం వైపు నడిచాడు.

**శిక్షణా కాలం**

"మా తండ్రి కంపెనీలో నేను అట్టడుగు గుమాస్తా పని నుండి మానేజింగ్ డైరెక్టర్ వరకూ మధ్యనున్న అన్ని రకాల పనులు చెమటోడ్చి నేర్చుకున్నాను. ఆ పక్షం రోజుల శ్రమ నేనెప్పటికీ మరువజాలను" అని సగర్వంగా ప్రకటించాడు, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌లో గిర్రున తిరిగిన కుమార రత్నం.

భాయ

విసవిసా వస్తున్న రత్నాన్ని చూసి నటన మరిచి భగవతి ఫ్రీజ్ అయింది. భగవతిని, రత్నాన్ని మార్చి మార్చి చూసి ఒక కుర్చీలో కూలబడ్డాడు స్వామి.

"ఏమ్మా! నిజం చెప్పు-కావలిస్తే పదో పరకో దండి ఇస్తాం. నీవు చెబుతున్నది అబద్ధం కదూ? పోలీసులని పిలిస్తే ఇబ్బందిలో పడతావ్?" రత్నం రెచ్చిపోయాడు.

"నా పిల్లల సాక్షి అండి...:" ఏడుపు అడ్డింది మాటలని.

"ఒకటే తరుణోపాయం. తలా పాతికవేసుకుని వాళ్లని తిరిగి కర్నూలు పంపించెయ్యటం" అన్నాడు స్వామి - ఇవ్వటానికి ఎలాను తన దగ్గిర డబ్బులేదు కాబట్టి.

చింతామణికి ఈ సూచన నచ్చింది. ఆఫీసు రూములు తిరిగి నాలుగువందలు దండుకొచ్చారు.

"ఆరున్నరకు విజయవాడ ప్యాసింజరుంది. దానికి దిగబెడతారు. విజయవాడలో దిగండి. స్టేషను బయటకొచ్చి ఆటో చేయించుకుని బస్టాండుకు వెళ్లండి. కర్నూలు బస్సులో వెళ్లిపోవచ్చు." స్వామి.

## నాలుగవ రంగం

దగ్గిర దగ్గిర నెలరోజుల తర్వాత థియేటర్లో కలిశారు రత్నం, చింతామణి. నాటకం అవుతోంది. భగవతి అద్భుతంగా నటిస్తోంది. ప్రేక్షకులు లీనమై చూస్తున్నారు - వినోదిస్తున్నారు.

"ఏరా, బండి ఎక్కించావా అతిథులను ఆ రోజు?"

"నన్ను తినేశారు పిల్లలు-అది కావాలి, ఇది కావాలి అని. పాసింజరు పాసింజరేగదా. బయలుదేరటంలో కూడా లేటే. వాళ్లు వెళ్లి ఉంటారు."

రత్నం నవ్వాడు-నవ్వి అన్నాడు, "వాళ్లు ప్లాట్‌ఫాం బయటకొచ్చి టిక్కెట్లు రిఫండు చేసి మిగిలిన డబ్బులు తీసుకుపొయ్యుంటారు. ఎలానూ కొంత క్యాషు ముట్టచెప్పావు."

చేతిలోని కాప్ నెత్తిమీద ఉంచుకుని అన్నాడు చింతామణి - "మన అడ్రసిచ్చాం, చేరంగానే టెలిగ్రాం ఇవ్వమని, ఉత్తరం రాయమని, డబ్బు పంపించెయ్యమని."

'ఆమె ఇచ్చిన చిరునామాకు ఉత్తరం రాశావా?'

"నెలరోజులయ్యిందిగా, సమాధానం ఏమన్నా వచ్చిందా?"

కాప్ తీసి తిరిగి నెత్తిమీద పెట్టుకున్నాడు,

"నెలాఖరు గదా-డబ్బుచేతిలో ఉండి ఉండదు. డబ్బు పంపిస్తూ ఉత్తరం రాయవచ్చని వాళ్లు బద్ధకించి ఉండవచ్చు. హైదరాబాద్ నుంచి భర్త తిరిగి వచ్చాడో, లేదో. మరో వారం రోజులాగితే తేలుతుంది." నెత్తిమీద కాప్ సవరించుకున్నాడు.

"ఏమి పాజిటివ్ థింకింగ్! నిజంగా అంత నమ్మకం ఉందా, నిన్ను నీవు మోసగించుకుంటున్నావా?"

నెత్తిమీద కాప్ అనీజీగా అనిపించింది, తీసి వేలుకు తగిలించి తిప్పుతున్నాడు. క్షణం మౌనంగా ఆలోచించాడు. సహేతుకమైన సమాధానం కావాలి-తనను, రత్నాన్ని ఒప్పించటానికి. కాప్ తగిలించుకుంటూ అన్నాడు: "ఆమె మోసగత్తే అనుకుందాం. అంతలా నటించి, పిల్లలను వెంటేసుకుని తిరిగి, శ్రమపడి, నీలాంటి వాళ్ల అనుమానపు చూపులకు, మాటలకు గురి అవుతోందంటే - దానికి ఒక దయనీయ పరిస్థితి కారణం. మన జాతీయ కాలక్షేపం దగా. కడుపు నింపుకోవటానికి ఆ స్త్రీ చేసేది ఏ పాటిది?

"ఒక వీధి మనిషి నటనకు మోసపోయినందుకు సిగ్గుపడే బదులు, సమర్థిస్తున్నావా?"

**(యవనిక)**